క్లుప్తంగా

ఉద్యోగులకు అండగా ఉంటాం



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎన్‌జీఓ అధ్యక్ష, కార్యదర్శులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్‌జీఓ అసోసియేషన్ చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు పేర్కొన్నారు. స్థానిక 20వ డివిజన్ వార్డు సచివాలయ ఉద్యోగులతో వారు మాట్లాడారు. సచివాలయంలో సమస్యలు, ఉద్యోగులకు వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, వాటి నిర్వాహణను సమగ్రంగా ప్రజలకు అందించాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కార్యదర్శి రామారావు కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): శాశ్వత లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి కోరారు. స్థానిక న్యాయసేవా భవన్ నందు వివిధ శాఖల అధికారులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, వైద్యం, విద్య, బ్యాంకింగ్, ఎన్‌ఆర్‌జీఈఎస్, హౌసింగ్, రియల్ ఎస్టేట్, పారిశుధ్యం తదితర సేవల్లో లోపం జరిగినప్పుడు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సేవలన్నీ ఉచితంగా అందించడంపై అధికారులు ప్రజల్లో అవగాహన కలిగించాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, టెలికం, డీఎంహెచ్‌ఓ, ఏపీఎస్ ఆర్టీసీ, సెంట్రల్ బ్యాంకు, కెనరా బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేటలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.34,680 స్వాధీనం చేసుకున్నారు. నిందితులు, నగదును ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అప్పగించటంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని ఎస్‌బీ ఎస్సై అల్లూరయ్య తెలిపారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం

అంబేడ్కర్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



ఫైర్‌స్టేషన్ సెంటరులో పవన్ ఫ్లెక్సీ దహనం చేసి నినదిస్తున్న వలంటీర్లు



పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తంచేస్తున్న 15 డివిజన్ వలంటీర్లు



కార్పొరేటర్ దాసు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన



సెయింట్ ఆన్స్ సెంటర్‌లో పవన్ దిష్టిబొమ్మతో నిరసన

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సెంటరులో ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమైంది. వలంటీర్లు స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటరులో సోమవారం సాయంత్రం ఆందోళన చేశారు. పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని చెప్పులతో కొట్టి తగలపెట్టారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలనూ అర్హులందరికీ పారదర్శకంగా అందిస్తున్నట్టు చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ వచ్చాకే రాష్ట్రంలో మహిళల అక్రమరవాణా ఎక్కువైందని పవన్ కళ్యాణ్ విమర్శించడం బాధాకరమన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్దే తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో 35, 36 వార్డు సచివాలయాల వలంటీర్లు కె.రామకృష్ణ, కె.కళ్యాణ్ , ఎస్‌ఎమ్‌ఎస్ మదన్, కె.సుబ్బారావు, ఆళ్ల విజయలక్ష్మి, పట్టపు రేణుక, కె.హారిక పాల్గొన్నారు.

చెప్పులతో కొట్టి నిరసన

ఏలూరు రూరల్: వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేసిన జనసేన నేత పవన్ కళ్యాణ్ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వెంకటాపురం -1 సచివాలయం వద్ద పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. నిజాయితీగా ప్రజలకు సేవచేస్తోన్న తమపై పవన్ కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. పవన్ కళ్యాణ్ తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు.

● 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము ఆధ్వర్యంలో వలంటీర్లు స్థానిక దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ మతిస్థిమితంలేదని వలంటీర్లు ఆరోపించారు. ప్రజా సేవ చేసుకునే అవకాశం కల్పించారంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

పవన్ దిష్టిబొమ్మ దహనం

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేట సెయింట్ ఆన్స్ కళాశాల సెంటర్ వద్ద దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం పలువురు వలంటీర్లు నిరసన ప్రదర్శన చేశారు. పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్, బహిరంగ క్షమాపణలంటూ నినదించారు. పార్టీ నేతుల వలంటీర్లకు సంఘీభావం తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

చెగువేరా, భగత్‌సింగ్, పింగళి వెంకయ్య అంటూ మహానేతలు, ఉద్యమనేతల స్ఫూర్తి అని చెప్పుకునే పవన్ కళ్యాణ్ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కనీసం పూలమాలలు వేసి నివాళులర్పించకపోవటాన్ని దళిత నేతలు తప్పుబట్టారు. సోమవారం సాయంత్రం కార్పొరేటర్ పొలిమేర దాసు, వైఎస్సార్‌సీపీ సర్పంచ్ తేరా ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాసు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాలను అవమానకరంగా చేస్తే దళితులు సహించబోరని హెచ్చరించారు.

మాదేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం



తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో మూర్తి

ఏలూరు రూరల్: ఏలూరు మండలం మాదేపల్లిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్ అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్వో, మండల ప్రత్యేక అధికారి ఏవీ ఎస్‌ఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పలు ధ్రువ పత్రాలను అందజేశారు. తొలుత తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళ కుమారి స్థానిక పాఠశాలను సందర్శించారు. నాడు–నేడు నిధులతో చేపట్టిన తరగతి గదులు నిర్మాణ పనుల ప్రగతిని హెచ్‌ఎం సుంకర వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పువ్వులు ఆంజనేయులు వివరించారు. కొద్దిసేపు విద్యార్థులతో మాట్లాడారు.

సమస్యలు పరిష్కారించాలి

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగన్‌వాడీ కార్యకర్తలు ఏలూరు కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపట్టారు. తొలుత జూట్ మిల్లు సెంటర్, ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్ ఆఫీసు మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈనెల 11న మధ్యాహ్నం వరకు ధర్నా కొనసాగనుంది. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడారు. ఏపీ ఎన్జీవోల సంఘం, ఏపీ భవననిర్మాణ సంఘం, ఆశావర్కర్స్ యూనియన్, రైతు సంఘం, కేవీపీఎస్ నాయకులు మద్దతు తెలుపుతూ మాట్లాడారు.

పూర్వ విద్యార్థి వితరణ



మల్లేశ్వరరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఏఆర్‌డీజీకే మున్సిపల్ స్కూల్‌కు అవసరమైన కొన్ని సౌకర్యాలు కల్పించేందుకు పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ ఏనుగుల నాగ మల్లేశ్వరరావు ముందుకొచ్చారు. సోమవారం తాను చదివిన పాఠశాలకు విచ్చేశారు. సైకిల్ స్టాండ్ నిర్మాణానికి, కంప్యూటర్ల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపై చేర్చేందుకు పాఠశాల పేరున ఒక వెబ్‌సైట్ రూపొందించడానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి డి.హుస్సేన్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు రూ.25 వేలు విరాళంగా ఇచ్చారని, ప్రస్తుతం పూర్వ విద్యార్థుల సంఘ నిర్వహణకు రూ.50 వేలు అందించారని చెప్పారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావును పూర్వ విద్యార్థుల సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు పి.వెంకటేశ్వర రావు, మేతర అజయ్ బాబు, బీజే సతీష్, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రరాజు నియామకం హర్షణీయం



ప్రమాణస్వీకారం చేస్తున్న భూపతిరాజు రవీంద్రరాజు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడిగా భూపతిరాజు రవీంద్రరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల జిల్లా వీఆర్‌ఓల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా వీఆర్‌ఓల సంఘం అధ్యక్షులు రాంబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి రవీంద్రరాజు కృషిచేస్తున్నారని, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా రవీంద్రరాజును ఎనుకున్నారని తెలిపారు. జిల్లా వీఆర్‌ఓల సంఘం తరుపున నూతన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన కార్యకర్తలపై అట్రాసిటీ కేసు పెట్టాలి



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

ఏలూరు (టూటౌన్): వారాహి యాత్ర సందర్భంగా ఆదివారం ఏలూరులో జనసేన కార్యకర్తలు అంబేడ్కర్‌ను అవమానించారని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు దళిత నాయకులు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. జనసేన కార్యకర్తల చర్యలను నిరసిస్తూ నగరంలో ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సభ నేపథ్యంలో జనసేన కార్యకర్తలు చెప్పులతో అంబేడ్కర్ విగ్రహం పైకి ఎక్కడం అవమానించడమేనని మండిపడ్డారు. దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన జనసేన కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కందుల రమేష్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అంబేడ్కర్ విగ్రహానికి కనీసం పూలమాల వేసి నివాళులర్పించకపోవడం దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని చెప్పారు. మాలమహానాడు రాష్ట్ర నాయకుడు అబ్బూరి అనిల్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అంబేడ్కర్‌ని అవమానించారని, ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారాహి యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. దళిత సీనియర్ నాయకుడు నూకపెయ్యి కార్తీక్ మాట్లాడుతూ తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గొల్ల కిరణ్, పి.డేవిడ్, పెరియార్ పూలే అంబేడ్కర్, గుజ్జుల ధనరాజు, నీడిగట్టి సుధీర్, అబ్రహం పాలస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో స్థలం అమ్మకానికి బిడ్ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బీఎస్ఎన్ఎల్ స్టోర్ యార్డు స్థలం 4,999 చదరపు గజాలు ఈ వేలం ద్వారా అమ్మకానికి బిడ్లు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను ఒక ప్రకటనలో కోరారు. బిడ్లను ఆగస్టు 3 నుంచి 17వ తేదీలోపు సమర్పించాలని పేర్కొన్నారు. బిడ్లను ఆగస్టు 18, మధ్యాహ్నం 3 గంటలకు తెరవనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94906 44555, 94901 22622, 94235 65008లో సంప్రదించాలని శ్రీను కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	90	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07–10
బెండకాయలు	36	కంద	40
పచ్చిమిర్చి	90	బీట్‌రూట్	40
కాకర కాయలు	50	కీరా దోస	54
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30–34	బఠాణి	--
అనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు



ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్‌డివిజన్, కై కలూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులతో నేర సమీక్ష చేశారు. గంజాయి, నాటుసారా, మత్తు పదార్థాల రవాణా చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. నిత్యం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి మంగళవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ సమావేశం నిర్వహించి, మహిళా సంరక్షణ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై నిత్యం రాత్రివేళల్లో వాహన తనిఖీలు, ఫేస్ వాష్ నిర్వహించాలన్నారు. రాత్రి, పగలు పోలీస్ బీట్స్‌ను బలోపేతం చేయాలని సూచించారు. రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలు నిత్యం పెట్రోలింగ్ చేయాలన్నారు. మహిళల ఫిర్యాదులపై సకాలంలో న్యాయం చేయాలని, మిస్సింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. స్పందనలో ఫిర్యాదులను కాలపరిమితిలోపు పరిష్కరించాలన్నారు. సమీక్షలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, సీఐలు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై సాధిక్ తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ అబద్ధాల కోరు



సమావేశంలో మాట్లాడుతున్న వనజ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని మోదీ అబద్ధాల కోరు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెట్టారన్నారు. అమరావతికి నిధులు, కేటాయించకుండా ప్రధాని మోదీ మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను తన అనుంగ మిత్రులకు కారు చౌకగా కట్టబెట్టి ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్రను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ యాత్రను విశాఖపట్టణం నుంచి ఏఐటీయూసీ జాతీయప్రధాన కార్యదర్శి అమరిజిత్ కౌర్ ప్రారంభిస్తారన్నారు. తిరుపతిలో జరిగే ముగింపు సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా హాజరుకానున్నట్టు తెలిపారు. సమావేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కారంద దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, బాడిస రాము పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	29

ఐక్యంగా ఉద్యమించాలి

ఏలూరు (టూటౌన్): దేశంలో మత విద్వేషాలు రగిలిస్తోన్న పాలకులను గద్దె దించడానికి లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో సీపీఐ ఏలూరు జిల్లా కమిటీ సమావేశం సోమవారం బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని వనజ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజల మధ్య, విద్వేషాలను, వైరుధ్యాలను, మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఇటీవల ప్రపంచ దేశాలల్లో పర్యటించి శాంతి దూతగా ప్రకటించుకునే మోడీ తన ఎన్నికల ప్రయోజనాల కోసం వివిధ మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని నిర్మిస్తానని హామీ నిచ్చి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. మోదీ దుర్మార్గ పాలనకు తెరపడేందుకు సీపీఐ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పెరుగ్గూడెంలో ప్రారంభోత్సవాలు

దెందులూరు: మండలంలోని పెరుగ్గూడెంలో మంగళవార గ్రామ సచివాలయాలు, సీసీ రోడ్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి తెలిపారు. కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెదపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.1లక్ష నుంచి రూ.6ల క్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు, చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,500, సామాజిక భద్రతా పింఛన్ ద్వారా 2,750, ఆటోడ్రైవర్లుకు రూ.10 వేలు, చేయూత పథకం ద్వారా దర్జీలకు, ఇస్త్రీ పనివారికి రూ.10 వేలు, వైఎస్సార్ ఆసరా పథకంలో ఏటా రూ.5 వేల నుంచి రూ.2 లక్షల వరకు మాఫీ చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామంలో డ్రెయినేజీ, రహదారి నిర్మాణం చేయాలని, ఇళ్ల రుణాలు ఇవ్వాలని ప్రజలు కోరడంతో సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ సర్టిఫికెట్లు లేక నిలిచిపోయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్ కుమార్, స్థానిక నాయకులు గొట్టాపు నర్సింహరావు, కొండేలాజరు, బత్తుల ఏసురాజు, కోట గోవర్ధన్, పూడి రంగప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కిట్లను ఆన్‌లైన్ చేయాలి

పెదపాడు : విద్యార్థులకు అందించిన జగనన్న విద్యాకానుక కిట్‌లు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని రమణ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల వివరాలు నూరు శాతం నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడు మృతి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతిచెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన వేణు (23) తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను ఈనెల 9న సాయంత్రం ఇంటివద్దనే పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వేణు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వైద్యులు మెడికో లీగల్‌కేసుగా నమోదు చేసి హాస్పిటల్ అవుట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.